క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలనలో ఆర్‌డీఓ, తహసీల్దార్ తదితరులు

వెల్దుర్తి: మండలంలోని చెరుకులపాడు, ఎల్ నగరం పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ మోహన్‌దాస్ మంగళవారం పరిశీలించారు. ఆయా పంచాయతీల మజారా గ్రామాలు పోలింగ్ కేంద్రాలకు గల దూరాన్ని తహసీల్దార్ శివరాముడును అడిగి తెలుసుకున్నారు. చెరుకులపాడు మజారా కొసనాపల్లె, ఎల్.నగరం మజారా ఎల్.కొట్టాల గ్రామాలలో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోరుతూ అందిన వినతుల మేరకు గ్రామాల నుంచి పోలింగ్ కేంద్రాలకు గల దూరాన్ని తనిఖీ చేసి, ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆర్‌డీఓ తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ మస్తాన్ వలి, బీఎల్ఓలు ఉన్నారు.

ఆఫ్‌లైన్ ద్వారా రేషన్ బియ్యం పంపిణీ

తుగ్గలి: రేషన్ కార్డుదారుల వేలిముద్రలతో పని లేకుండా ఆఫ్‌లైన్ పద్ధతిలో రేషన్ పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ రవి బుధవారం తెలిపారు. సాంకేతిక సమస్యలతో గత కొద్ది రోజులుగా సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో ఆఫ్‌లైన్ విధానంలో కార్డుదారులకు సరుకులు ఇవ్వాలని డీలర్లు, ఎండీయూ వాహనదారులకు స్పష్టం చేశామన్నారు. వేలిముద్రలు పడలేదన్న సాకుతో బియ్యం ఇవ్వకుండా కార్డుదారులను వెనక్కి పంపరాదని, ప్రతి డీలర్ ఈ అంశాన్ని పాటించాలన్నారు.

మరకట్టు చేరిన సలువప్ప స్వామి



సలువప్ప తాత ఉత్సవమూర్తి

ఆలూరు: మండలంలోని మరకట్టు గ్రామంలో కొలువుదీరిన సలువప్ప తాత ఉత్సవమూర్తి పల్లకీతో పాదయాత్రగా కర్ణాటక రాష్ట్రంలోని హంపి విరుపాక్షయ్య స్వామి దర్శనానికి తరలివెళ్లిన భక్తులు తిరిగి బుధవారం పెద్దహోతూరు గ్రామంలో కొలువుదీరిన ఉచ్చీరప్ప తాత దేవాలయాన్ని చేరుకున్నారు. ఆలయంలో అర్చకులు చంద్రమౌళీస్వామి సమక్షంలో అఖండ పూజలు నిర్వహించారు. అనంతరం మరకట్టు గ్రామంలో కొలువుదీరిన సులువప్ప తాత ఆలయానికి చేరరకున్నారు. ఆ గ్రామస్తులు మేళ తాళాలు, భాజాభజంత్రీలతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆస్పరి: మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రామాంజినేయులు బుధవారం తెలిపారు. ఈనెల 9వ తేదీన కర్నూలులో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-17 విభాగంలో 10వ తరగతి విద్యార్థిని ఓమేశ్వరీ, అండర్ -14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని అనిత ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను హెచ్‌ఎం షేక్ అహ్మద్, ఉపాధ్యాయులు అభినందించారు.

15 నుంచి రంగనాథ స్వామి ఉత్సవాలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి వారిని ప్రతిరోజు ఒక్కో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం తూర్పుపేట గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 23వతేదీ మహాపూజతో పాటు శమీపూజ, దసరా ఉత్సవాలు ఉంటాయని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం

నందవరం: తాగునీటి కోసం నూతన పైపులైన్ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ లక్ష్మి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో తాగునీటి కోసం రిలయన్స్, ఆర్డీఫ్ సంస్థ సహకారంతో కాలనీలో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిలయన్స్, ఆర్డీఫ్ సంస్థ సహాయంతో రెండు కాలనీలో నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఆర్డీఫ్ సంస్థ కార్యకర్త ఉసేని, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీమకు న్యాయం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: రాయలసీమ పరిస్థితులను దృష్టిలో ఉంకొని కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య అమలు చేసి కృష్ణా నది యాజమాన్య బోర్డ్‌ను రాయలసీమలో ఏర్పాటు చేయాలని ఆర్‌పీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నల్లారెడ్డి యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రాఘవేంద్ర కళాశాలలో విద్యార్థులతో కలిసి 'మన రాయలసీమ' కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యానికి సురక్ష

కృష్ణగిరి: దేశంలో ఏక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇళ్ల వద్దకే వైద్య సేవలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో బుధవారం సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులను నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడమే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందిస్తున్నారన్నారు. సీఎం జగనన్న చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. రోగులకు అందిస్తున్న సేవలను స్థానిక వైద్యులు ప్రదీప్‌ను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, వైస్ ఎంపీపీ బోయ సుశీల, ఎంపీడీఓ విశ్వమోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మల్కాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో ప్రజలకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్ దేవేంద్ర రెడ్డి, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీవో బంగారమ్మ, నాయకులు భీమిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని గాజులదిన్నె గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్ పరిశీలించారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ఏడు రకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని పెద్దకొత్తిలి గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ దశరథ రామయ్య, సర్పంచ్ బైటిగేరి శివన్న, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి పర్యవేక్షించారు. డాక్టర్లు చంద్రకాంత్ యాదవ్, విజయ భారతి, రామచంద్రుడు, బాలకృష్ణ వైద్య సేవలందించారు. జనరల్ ఓపీతో పాటు 68 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



తొగర్చేడులో వృద్ధురాలి ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

● కళ్లద్దాలు ఉచితంగా ఇచ్చారు



గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో నాకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలను అందించారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా వైద్యం చేయడంతో పాటు కళ్లద్దాలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇలాంటి వైద్య శిబిరాలు మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– గాదిలింగప్ప, మెదేహాల్ గ్రామం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని జూటూరు గ్రామంలో బుధవారం సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఎంపీడీఓ కవిత అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎంపీపీ నారాయణదాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకుని ఉచితంగా వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రావణి ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రంగమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా పుల్లగుమ్మి గ్రామంలో నిర్వహించిన హెల్త్ క్యాంప్ విజయవంతమైంది. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 485 మంది వైద్య సేవలు పొందారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసకుమార్ శిబిరాన్ని పరిశీలించారు. పలువురికి కంటి అద్దాలు, హెల్త్ కార్డులు పంపిణీ చేశారు.

తుగ్గలి: మండలంలోని జొన్నగిరి సచివాలయం -1 పరిధిలో ఎంపీడీఓ సావిత్రి ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో స్పెషలిస్టులు, స్థానిక వైద్యులు 223 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



జొన్నగిరిలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వైస్ ఎంపీపీ నాగప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామ సచివాలయంలో తహసీల్దార్ రామాంజినేయులు ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి రోగులు, వృద్ధులు భారీగా తరలివచ్చారు. వైద్యులు ఇబ్రహీం, వాహిద్, శాంతి, శివకుమార్ ఆధ్వర్యంలో 531 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ నాగరాజు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని కామినహాల్, మేదేహాల్ గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాన్ని తహసీల్దార్ మల్లికార్జునస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనార్దన్‌నాయుడు పర్యవేక్షించారు. వైద్యులు మన్సూర్‌వలీ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో వైద్యులు కళ్యాణ్, అరుంజ్యోతి, అతవుల్లా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 300 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు.



గాజులదిన్నెలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఏఓ వరలక్ష్మి



అరికెరలో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు



కామినహాల్‌లో మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

■ వైద్య శిబిరాలకు విశేష స్పందన

ఆస్పరి: గ్రామాల్లో నిర్వహిస్తున్న సురక్ష వైద్య శిబిరాలకు రోగుల నుంచి మంచి స్పందన లభిస్తోందని 'జగనన్న ఆరోగ్య సురక్ష' జిల్లా నోడల్ ఆఫీసర్ బాలమురళీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని నగరూరు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి డాక్టర్లు, రోగులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సురక్ష వైద్య శిబిరాలలో రోజుకు 400 నుంచి 600 మంది రోగులు చికిత్స చేయించుకుంటూ ఉచితంగా మందులు అందుకుంటున్నారన్నారు.



నగరూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ బాల మురళీకృష్ణ

అన్ని రకాల రోగాలకు వైద్య నిపుణలచే పరీక్షలు చేయించి ఉచితంగా మందులు ఇస్తున్నామన్నారు. మెరుగైన చికిత్స అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ఆస్పత్రులలో వైద్యం చేయిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించవచ్చని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. శిబిరం నిర్వహించే రోజు పాఠశాలకు సెలవు ప్రకటిస్తామన్నారు. నగరూరులో నిర్వహించిన వైద్య శిబిరంలో 490 మంది రోగులకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేశామని డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. సర్పంచ్ సావిత్రమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శంకరప్ప, డాక్టర్లు బాలకృష్ణారెడ్డి, పవన్ కృష్ణ, మాధవీలత, కల్పన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పుల్లగుమ్మి శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్



పెద్దకొత్తిలిలో వైద్య శిబిరానికి హాజరైన జనం



జూటూరు శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాస్



మల్కాపురం శిబిరంలో మాట్లాడుతున్న బీఆర్.బసిరెడ్డి



గుండ్లకొండలో గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యసిబ్బంది

హమాలీలను ఆదుకోవాలి

వెల్దుర్తి: పని చేస్తేనే కూలీ, చేయకపోతే పస్తులు, వయసుడిగిన తర్వాత అనారోగ్యానికి తోడు ఆర్థిక ఇబ్బందులు గల వృత్తి హమాలీ అని, ప్రభుత్వాలు హమాలీ వృత్తిని కాపాడేలా, వారికి రక్షణ, భరోసా కలిగేలా గుర్తింపు కార్డులు జారీ చేసి భద్రతా చర్యలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో సీఐటీయూ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యాలయ భవనం ప్రారంభం సందర్భంగా ఆయన సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సీఐటీయూ జిల్లా ప్రతినిధులతో కలిసి వచ్చి జెండావిష్కరణ చేశారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఎంఏ గఫూర్ మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా ఉంటూ సమస్యల సాధనకు పోరాడాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సీనియర్ నాయకుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరిశాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం-2 పరిధిలో 5వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని, పథకాలను గ్రామస్తులకు వివరించారు. గ్రామస్తులు అడిగిన తాగునీరు, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు, సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని కొనియాడారు. సంక్షేమ పథకాలతో పేదల సంతోషంగా జీవిస్తున్నారని, జీవన ప్రమాణాలు పెరిగాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శివారెడ్డిగౌడ్, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, సర్పంచ్‌లు విరుపాక్షిరెడ్డి, తోట సావిత్రి, నాయకులు రమేశప్పగౌడ్, నాగరాజు, ఎంపీడీఓ దశరథరామయ్య, ఎంఈఓ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

రేషన్ బియ్యం పట్టివేత

హొళగుంద: అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని బుధవారం కర్నూలు నుంచి వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. విజిలెన్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ హనుమంతయ్య, తహసీల్దార్ వెంకట నారాయణ, హొళగుంద తహసీల్దారు హుసేన్‌సాహేబ్, సిబ్బంది మార్లమడికి రోడ్డులో తనిఖీలు చేపట్టగా రెండు వాహనాల్లో అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ మేరకు నిందితులు గొల్ల రాజశేఖర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి 126 బస్తాలు (73 క్వింటాళ్లు) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న రెండు ఆటోలను సీజ్ చేశారు.

ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మించాలి

గోనెగండ్ల: ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, మండల కార్యదర్శి నాగప్ప డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అలువాల గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన సత్వరమే పూర్తి చేయాలని కోరారు. అనంతరం సచివాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

వెల్దుర్తి: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. పట్టణంలో నిర్మించిన సీఐటీయూ అనుబంధ హమాలీ వర్కర్ల యూనియన్ కార్యాలయాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డితో కలిసి శిలాఫలకం ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులు సంఘటితంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె నాగేశ్వరరావు మాట్లాడారు. ఎమ్మెల్యే, అతిథులు తహసీల్దార్ శివరాముడు, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిలను పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



వెల్దుర్తిలో హమాలీ వర్కర్ల యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఘనంగా గంధం వేడుకలు

హొళగుంద: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గా ఉరుసులో భాగంగా బుధవారం గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలను తిలకించడానికి రాష్ట్ర నలుమూలల నుంచే గాక పొరుగురాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గాలోని సమాధులను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్ధరాత్రి మొదలై తెల్లవారుజాము వరకు గంధం గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు జరిగింది. ఆ తర్వాత గంధం షేక్షావలి, షాషావలి దర్గాలకు చేరడంతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కళాకారులు కర్రసాము, ఇతర విన్యాసాలను ప్రదర్శించారు. భక్తులకు తాగునీరు, వసతి సదుపాయాలు కల్పించినట్లు సర్పంచ్ కురువ చాముండేశ్వరి, దర్గా నిర్వాహకులు తెలిపారు. హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక అలంకరణలో సమాధులు

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



పార్లపల్లిలో మిరప పంటను పరిశీలిస్తున్న అధికారిణి శ్రీవాణి, శాస్త్రవేత్త మౌనిక

ఎమ్మిగనూరురూరల్: రైతులు మిరప పంట సాగులో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల ఉద్యానధికారిణి శ్రీవాణి, ఉద్యాన శాస్త్రవేత్త మౌనిక సూచించారు. బుధవారం మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలోని మిరప పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిరప పంటలకు ఆకుముడత, వైరస్ తెగులు వ్యాపించినట్లు గుర్తించామని చెప్పారు. ఈ తెగులు నివారణకు పసుపు, నీలం రంగు జిగురు అట్టలను ఉధృతిని బట్టి 20 నుంచి 40 వరకు అమర్చుకోవాలని చెప్పారు. పొలం చుట్టు కంచె పంటలుగా జొన్న, సజ్జ, కందిని సాగు చేసుకోవాలని తెలిపారు. డైపెంథూరియన్ ప్లస్ అసిటామిప్రిడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. సయానాంట్రిలిప్రోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఫిప్రోనిల్ ప్లస్ ఇమిడాక్లోప్రిడ్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే పంటలో తెగులు ఉధృతిని తగ్గించవచ్చునని పేర్కొన్నారు.

ప్రతి రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి లలితవరలక్ష్మీ సూచించారు. ఆమె బుధవారం కడిమెట్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆర్‌బీకేలో రికార్డులు, పంటల నమోదు, స్టాక్‌పై వీఏఏలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్‌తో పాటు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేని పక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తించవని చెప్పారు. రబీ పంటల సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. పత్తి, వేరుశనగ, మిరప పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలు పాటించి మందులను వాడాలని చెప్పారు. రసాయన ఎరువులు పరిమితికి మించి వాడరాదని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ మహేశ్వర రెడ్డి, వీఏఏలు తదితరులు ఉన్నారు.



కడిమెట్ల ఆర్‌బీకేలో ఈ-కేవైసీ వివరాలు తెలుసుకుంటున్న డీఏఓ లలితవరలక్ష్మీ

ఆయకట్టు రైతులను ఆదుకోవాలి

గోనెగండ్ల: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు కాలువల ద్వారా నీళ్ల వదిలి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని రైతులు చిట్యాల మునెప్ప, ఉరుకుందు, కురువ రంగముని కోరారు. బుధవారం గోనెగండ్ల రైతులు ఇరిగేషన్ కార్యాలయం వదకద ధర్నా చేశారు.వారు మాట్లాడుతూ.. పంటల సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు దిగుబడులు రాకపోతే అప్పుల ఊబిలోకి వెళ్లాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి డీపీ 86, పీడీ కాలువలకు నీటిని వదిలి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన అధికారులు ఆ కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ విషయంపై ఏఈ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎల్లెల్సీ దిగువ కాలువకు 40 క్యూసెక్కుల మేర నీరు ప్రవహిస్తోంది. రైతులు వంతులు వారీగా, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

గోడౌన్ నిర్మాణానికి స్థల పరిశీలన

గోనెగండ్ల: మండల కేంద్రంలో సహకార సంఘం గోడౌన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని డీసీఓ రామాంజనేయులు, డీఈ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం గోడౌన్ నిర్మాణానికి సింగిల్ విండో అధ్యక్షుడు గంజిహళ్లి తిరుమల రెడ్డితో కలిసి గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ గోనెగండ్ల సహకార సంఘానికి సంబంధించి రెండు గోడౌన్లను నిర్మించేందుకు ప్రభుత్వం రూ.92 లక్షల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. స్థల సేకరణ పూర్తికాగానే పనులు వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. ఏఈ వీరేష్, సీఈఓ చంద్రశేఖర్ వెంట ఉన్నారు.